క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ దేశ్‌ముఖ్‌కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో 10 నుంచి 11 గంటల వరకు. 11కేవీ సాయికాలనీ, సౌత్‌ఎండ్ పార్కు ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ విజయపురికాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు. 11కేవీ పెద్దఅంబర్‌పేట పారిశ్రామికవాడ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంట వరకు. 11కేవీ బీరప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలోని కాలనీలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

గుర్రంగూడలో మేరీమిట్టీ-మేరాదేశ్


మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో శుక్రవారం మేరీమిట్టీ-మేరాదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వజ్రోత్సవాల్లో భాగంగా దేశం నలుమూలల నుంచి మట్టిని సేకరించి దేశం కోసం అమరులైన వారిని స్మరిస్తూ ఢిల్లీలో స్థూపాన్ని నిర్మిస్తున్నారని అందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గుర్రంగూడలో ఇంటికింటికి తిరిగి మట్టి సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జంగారెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివగంగలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీదేవి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణ నిర్వహించారు. శివుడికి పూలతో అభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛత లీగ్ 2.0పై ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణానికి హాని కల్గించి కాలుష్యాన్ని వెదజల్లే వాటిపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరూ పాటుపడాలని, ఇది అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల చేత స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి


ఆర్థికసాయం అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: నిరుపేద విద్యార్థుల చదువులకు అండగా ఉంటామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామానికి చెందిన రమేశ్ అనే విద్యార్థి ఉన్నత చదువుల కోసం జర్మనీ దేశం వెళుతున్న క్రమంలో ఆర్థిక ఇబ్బందుల వలన రాఘవేందర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు కలిశారు. దీంతో విద్యార్థి ఉన్నత చదువుల కోసం ఆయన రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే ఆపేయకూడదని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. రాంనుంతల మాజీ సర్పంచ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ పూర్తయ్యేనా?


పెద్దచెరువు శ్మశానవాటిక వద్ద పరిస్థితి

- పెద్దచెరువు సుందరీకరణలో భాగంగా సిర్లాహిల్స్ వద్ద కట్ట మూసివేత
- రహదారి మూసివేయడంతో వాహనదారుల అవస్థలు

మీర్‌పేట: కట్ట విస్తరణ పనులు పూర్తయ్యేదెప్పుడు.. మూసిన రహదారిని తెరిచేదెన్నడు..? వివరాల్లోకి వెళితే. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్దచెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువు కట్టను విస్తరించేందుకు సిర్లాహిల్స్ శ్మశానవాటిక వద్ద రహదారిని అధికారులు మూసివేయడం జరిగింది. పనులు మొదలై నెలలు గడుస్తున్నా కట్ట విస్తరణ పూర్తికాకపోవడంతో పాటు రహదారి మూసివేసి ఉంచడంతో అటు వాహనదారులు, ఇటు అంత్యక్రియల నిమిత్తం శ్మశానవాటికకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. పనుల పేరిట కట్ట రహదారిని మూసివేయడంతో చుట్టూ తిరిగి వెళ్తున్నామని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇక పెద్ద వాహనాలు అయితే మీర్‌పేట మంత్రాల చెరువు మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. కట్టకు ఓ వైపు రహదారిని తెరిచి మరోవైపు మూసివేయడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అపరిశుభ్రంగా పరిసరాలు..

కట్ట విస్తరణ పేరిట సిర్లాహిల్స్ శ్మశానవాటిక వద్ద మట్టిపోసి కట్టను మూసివేయడంతో పరిసరాలన్నీ దుర్గంధంగా మారాయి. చెత్త చెదారంతో పాటు ఇటీవల కురిసిన వర్షపునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అంత్యక్రియలకు వచ్చి నిలబడలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. శ్మశానవాటిక బయట చెత్త, మురుగు నిలిచి అసౌకర్యంగా ఉండటంతో స్థానికంగా ఉండేవారు అంత్యక్రియలకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారని స్థానికులు తెలిపారు. త్వరితగతిన చెరువు కట్ట పనులను పూర్తిచేసి రహదారిని అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

> **పనులు త్వరగా పూర్తిచేస్తాం**
>
> పెద్దచెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నాం. కట్ట విస్తరణలో భాగంగా రహదారిని మూసివేయడం జరిగింది. సుందరీకరణ పనులను వేగంగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. శ్మశానవాటిక వద్ద పోగైన చెత్తను తొలగిస్తాం. రహదారిని పునరుద్ధరిస్తాం.
>
> – దుర్గ, మేయర్, మీర్‌పేట కార్పొరేషన్

స్థానికేతరులకు ‘డబుల్’ ఇళ్లా?



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న వీరేందర్ గౌడ్

- మంత్రి సబితారెడ్డిపై బీజేపీ నేత వీరేందర్‌గౌడ్ ఫైర్
- మహేశ్వరంలో బంద్ ప్రశాంతం

మహేశ్వరం: మహేశ్వరాన్ని మరో పాతబస్తీగా మార్చేందుకు మంత్రి సబితారెడ్డి ప్రయత్నిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో స్థానికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మండలబంద్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ... మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన ఇళ్లులేని పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేయకుండా పాతబస్తీకి చెందిన చార్మినార్, యాకుత్‌పూర, మలక్‌పేట్, బహదూర్‌పూర నియోజకవర్గాలకు చెందిన ముస్లిం మైనార్టీలకు మహేశ్వరంలో నిర్మాణం చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న పేద ముస్లిం మైనార్టీలకు ఇళ్లు ఇస్తే తమకు అభ్యంతరం లేదని.. ఇతర ప్రాంతాలకు చెందినవారికి ఇవ్వడం సరైంది కాదన్నారు. మైనార్టీల ఓటు బ్యాంకు పెంచుకునేందుకే సబితారెడ్డి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ కుట్ర చేస్తున్నారన్నారు. ఇప్పటికైన నియోజకవర్గంలో ఉన్న స్థానిక పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానికేతరులకు ఇళ్లు ఇస్తే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వపాపయ్య గౌడ్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు యాదీష్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతునాయక్, మండల పార్టీ అధ్యక్షుడు మాధవచారి, మహేశ్వరం ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను పర్మినెంట్ చేయండి


నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన

మీర్‌పేట: ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది శుక్రవారం భోజన విరామ సమయంలో విధులు బహిష్కరించి శాంతియుత సమ్మె నిర్వహించారు. తమను ప్రభుత్వం పర్మినెంట్ చేయడంతో పాటు పేస్కేల్ అమలు చేయాలన్నారు. స్పందించకపోతే శనివారం నుంచి నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది.. శంకరాచారి, జీవన్ కుమార్, వాసుదేవ్, మహేందర్, సత్యనారాయణ, సుధాకర్, బాలకృష్ణ, మహికాంత్, ప్రవీణ్, శివ, పరమేశ్, అంజలి, మాధవి తదితరులు ఉన్నారు.

నేడు కందుకూరులో మంత్రి పర్యటన

కందుకూరు: కందుకూరులో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి మంత్రి సబితారెడ్డి శనివారం రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఓపెన్ జిమ్‌లు, సీసీ రహదారులు ప్రారంభిస్తారన్నారు. పీఎస్ పక్కన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో కందుకూరు, కొత్తగూడ గ్రామాలకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకాగలరని ఆయన కోరారు.

మహిళా సంఘం భవనాన్ని మంజూరు చేయండి

తలకొండపల్లి: మండలంలోని రాంపూర్ గ్రామానికి పొదుపు మహిళా సంఘం సమావేశ భవనాన్ని మంజూరు చేయాలని జెడ్పీటీసీ వెంకటేశ్ కోరారు. శుక్రవారం హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఎంపీపీ నిర్మలతో కలిసి జెడ్పీటీసీ వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 35 పొదుపు సంఘాల్లో సుమారుగా 500కు పైగా మహిళా సభ్యులు ఉన్నారని తెలిపారు. ఆర్థికాభివృద్ధి, బ్యాంక్ లావాదేవీలు, మహిళా సంక్షేమం తదితర అంశాలపై ప్రతి నెల సమావేశాలు నిర్వహించుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్, నాయకులు శ్రీశైలంగౌడ్, శేఖర్, శ్రీకాంత్, కృష్ణ, కిరణ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో శివారు కాలనీలకు తాగునీరు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


వాటర్ వర్క్స్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: త్వరలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ శివారు ప్రాంతంలోని గడప గడపకూ తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జలమండలి కార్యాలయంలో 10ఏ వాటర్ వర్క్స్ మేనేజర్ బలరాం, ఇతర అధికారులతో సమీక్షా సమావేశ నిర్వహించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్‌తో సమావేశమై తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరగా కొత్తగా 62 కిలో మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారన్నారు. దానితో పాటు మరో 19 కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటుకు అధికారులను ఒప్పించామని స్పష్టం చేశారు. త్వరలో 81 కిలో మీటర్ల పొడవుతో తాగునీటి పైప్ లైన్‌తో పాటు అవసరమైన కాలనీల్లో భూగర్భ డ్రైనేజీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో ఎల్‌బీనగర్ శివారు ప్రాంత కాలనీవాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.

మంత్రి సబితారెడ్డికి సన్మానం


మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న చిత్రాలేవుట్ కాలనీ ప్రతినిధులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రా అవుట్ కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు శుక్రవారం ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి పి. సబితారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ మాట్లాడుతూ, తమ కాలనీ అభివృద్ధికి మంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాలనీలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.90 లక్షలు, డివైడర్‌పై గ్రిల్ ఏర్పాటుకు రూ. 11 లక్షలు, పార్కు సుందరీకరణకు రూ. 8 లక్షల నిధులతో పాటు కాలనీలో ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించారని, అందుకే మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు రేగట్టె సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోదా కృష్ణారెడ్డి, సలహాదారులు మర్రి సత్యనారాయణ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, కిషోర్ రెడ్డి, శరత్, రామచందర్ రావు, నాగేంద్రయ్య, దివాకర్ రావు, నర్సింగరావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొలనులో నిమజ్జనం చేయండి: కార్పొరేటర్


పెద్దచెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిమజ్జన కొలనులో గణనాథులను నిమజ్జనం చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. నిమజ్జన కొలను వద్ద నిమజ్జన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పరిసర ప్రాంత కాలనీల ప్రజలు బస్తీల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను పెద్దచెరువులోని కొలనులో నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జన కొలను వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. క్రేన్లు ఏర్పాటు చేయటమే కాకుండా విద్యుత్ దీపాలను, తగినంత సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జన కార్యక్రమానికి సహకరిస్తున్న వివిధ శాఖల అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాతూరి శ్రీధర్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మంజుల


మంజులకు నియామకపత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: కాంగ్రెస్ పార్టీ యాచారం మండల మహిళా అధ్యక్షురాలిగా తాడిపర్తి గ్రామానికి చెందిన మంజులను నియమించారు. ఈ మేరకు శుక్రవారం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి మంజులకు అందజేశారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం, గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. మహిళలు అండగా ఉంటే పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రాచర్ల వెంకటేశ్వర్లు, రమావత్ జ్యోతినాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ, మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ జ్యోతినాయక్ పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ చైర్మన్ నియామకం

మంచాల: కాంగ్రెస్ పార్టీ మంచాల మండల ఓబీసీ సెల్ చైర్మన్‌గా లింగంగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఎంపికకు సంబంధించిన నియామకపత్రాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అందజేశారు. అనంతరం లింగంగౌడ్ మాట్లాడుతూ మండలంలో పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా, మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జంగయ్య, దాసు, ఓబీసీ సెల్ నియోజకవర్గ చైర్మన్ పాండు, ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు మల్లిక, మండల అధ్యక్షురాలు శిల్ప తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తలకొండపల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ శ్రీశైలం కోరారు. శుక్రవారం దేవుని పడకల్‌లో ఆవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సకాలంలో మందులు వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక, తాత్కాలిక వ్యాధులతో పాటు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ తిరుపతి, ఎంపీటీసీ రఘు, ఆవేర్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్న, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి నిరవధిక సమ్మె


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

కందుకూరు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆశ వర్కర్లు ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రారం ఆశవర్కర్లతో కలిసి కందుకూరు మండల వైద్యాధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్డీలకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడు నెలల క్రితం సమస్యల పరిష్కారం కోరుతూ ఆశ వర్కర్లు 45 రోజుల పాటు నిరవధిక సమ్మె చేశారన్నారు. సంబంధిత మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు. హామీ ఇచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం దిగివచ్చేలా 25వ తేదీ నుంచి విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె బాట పట్టనున్నారన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయండి


కందుకూరు: నిరాహార దీక్షలో అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కార్యాలయాల ఆవరణంలో శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సరైన వేతనం అందక అవస్థలు పడుతున్నారన్నారు. అయినా ప్రభుత్వాలు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కనీసవేతన చట్టాన్ని అమలుచేసి నెలకు రూ.26 వేల వేతనాన్ని అందించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రసన్న, కవిత, శైలజ, శమంత, బాలమణి, సుమతి, షాజాహాన్, స్వాతి, రేణుక, కల్పన, కవిత, స్వప్న, రాధిక, గోవింద, సరస్వతి, యశోద పాల్గొన్నారు.

మండల కార్యాలయం ఎదుట ధర్నా..

బడంగ్‌పేట్: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బాలాపూర్ మండల కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా అంగన్‌వాడీ కార్మికులను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. అంగన్‌వాడీలకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం బాలాపూర్ తహసీల్దార్ మాధవిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు నర్సింహ, ఎల్లయ్య, కనకయ్య, రేణుక, నీలమణి, గౌరి, సత్తెమ్మ, జానకమ్మ, సరిత, కల్పన తదితరులున్నారు.


మీర్‌పేట: బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ

గణనాథుడికి ప్రత్యేక పూజలు

మహేశ్వరం నియోజకవర్గంలో గణనాథుని మండపాల వద్ద భక్తుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం మండపాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్


పహాడీషరీఫ్: శ్రీరాంకాలనీలో..


హుడాకాంప్లెక్స్: మహిళలకు జ్ఞాపికలను అందజేసిన అతిథులు